క్లుప్తంగా

మంచినీటి ట్యాంకు చుట్టూ మురికినీరు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పోసానిపల్లి గ్రామంలో మంచినీటి ట్యాంకు చుట్టూ మురికి నీరు పారుతుండడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు చుట్టూ మురికి నీటితో పాటు, పొదలు పెరిగిపోయి అపరిశుభ్రంగా మారిందని దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాలు వ్యాపిస్తాయని దీనిని దృష్టిలో ఉంచుకుని ట్యాంకు చుట్టు శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : జిల్లాలో ఏన్‌హెచ్ 765డీ విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. రెండురోజులుగా జిల్లా సరిహద్దులోని పోచారం గ్రామం వద్ద నుంచి జాతీయ రహదారి విస్తరణ పనులు మొదలయ్యాయి. దీనిలో భాగంగా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామం నుండి మాల్తుమ్మెద గేట్ వరకు రోడ్డుకు ఒకవైపు ఉన్న చెట్లను, పొదలను తొలగింపజేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకిరువైపులా నాటిన హరితహారం మొక్కలు కనుమరుగవుతున్నా యి. మండలంలో చేపడుతున్న రోడ్డువిస్తరణ పనులపై సంబంధిత శాఖల అధికారులకు ముందస్తు సమాచారం ఇస్తే బాగుండేదని వా రు అభిప్రాయపడుతున్నారు.

రామారెడ్డి ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక



రామారెడ్డి : రామారెడ్డి మండలంలో ఎమ్మార్పీఎస్ కమిటీని ఆదివారం మండల కేంద్రం రామారెడ్డి ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఆదివారం రామారెడ్డి గ్రామ కమిటీని కామారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ కమిటీ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడు ఎల్లయ్య ఉపాధ్యక్షులుగా లింగం, కార్యదర్శిగా కంటికి రాజశేఖర్, కోశాధికారిగా కనికంటి రమేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ స భ్యులు సుంకపల్లి రాజయ్య ఎల్కుర్తి గోపాల్, బట్టు బాలయ్య ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, సుంకపల్లి పెద్దరాజయ్య తదితరులున్నారు.

రైతు మనస్సు తెలిసిన వ్యక్తి పోచారం



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : రైతు మనస్సు ఎరిగిన మనిషి పోచారం శ్రీనివాస్ రెడ్డి అని మాజీ ఏఎంసీ చైర్మన్ పెర్క శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలో మాట్లాడుతూ పోచారం ఆదేశానుసారం ముందస్తు వరి నాట్లకు రైతులు సిద్ధమయ్యారని, కాని అనుకున్నంత వర్షాల్లేకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిజాంసాగర్‌లో 4 టీఎంసీలు ఉన్నాయని వాటిని రైతులకివ్వాలని కోరగా సీఎం ఒప్పుకున్నారన్నారు. దీంతో ఆదివారం నీటిని విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్త్య విఠల్, మాజీ ఏఎంసీ చైర్మన్ మారుతి, నాయకులు ప్రతాప్, ఖలీల్, సాయిరాం యాదవ్ తదితరులున్నారు.

కృష్ణాజీవాడిలో క్రికెట్ పోటీలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కృష్ణాజీవాడి గ్రామ శివారులో క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలు 10రోజుల నుంచి కొనసాగాయి. ఈ క్రికెట్ పోటీల్లో తాడ్వాయి మండలం నుంచే ఇతర మండలాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. ఆదివారం కామారెడ్డి, కృష్ణాజీవాడి జట్లు పాల్గొనగా అందులో కామారెడ్డి జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో కృష్ణాజీవాడి జట్టు నిలిచింది. గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, అనీష్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, రవికిరణ్ పాల్గొన్నారు.





భిక్కనూరులో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు, బీబీపేటలో నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘననివాళి

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జమ్ముకాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దుకోసం ప్రాణాలు అర్పించిన భరతమాత ముద్దుబిడ్డ అని కొనియాడారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



పెద్దకొడప్‌గల్‌లో..



రామారెడ్డిలో..



లింగంపేటలో..



మద్నూర్‌లో..



దోమకొండలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు

వెల్లివిరిసిన మానవత్వం..!

- మెదక్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గోపాల్‌పేట యువకుడు
- వైద్యం కోసం సోషల్‌మీడియాలో సాయం కోరిన కుటుంబసభ్యులు
- ఒక్కరోజులోనే సుమారు రూ.లక్ష విరాళంగా అందించిన దాతలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడికి వైద్యం కోసం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు. మండలకేంద్రం గోపాల్‌పేటకు చెందిన కొత్తపేట విజయ్ తన మిత్రుడి ఆటోలో శనివారం మెదక్ వెళ్తుండగా మెదక్ జిల్లా శాలిపేట వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న విజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. విజయ్‌ను చికిత్స నిమిత్తం మొదట మెదక్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయ్‌ను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా విజయ్ కుటుంబం ఆర్థికంగా వెనకబడి ఉండడంతో అతనికి వైద్యం చేయించేందుకు అయ్యే ఖర్చుల కోసం కుటుంబీకులు సోషల్‌మీడియా వేదికగా అభ్యర్థించారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు విజయ్ కుటుంబ సభ్యుల బ్యాంకు అకౌంట్‌కు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా ఆర్థికసాయం అందించారు.



రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విజయ్

రూ.500 నుంచి రూ.5వేల వరకు సాయం చేశారు. మండలవాసులే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందినవారు కూడా సాయం చేయగా ఆదివారం మధ్యాహ్నం వరకు సుమారు రూ.లక్ష వరకు తమ ఖాతాలో జమయ్యాయని వాటితోనే చికిత్స జరుగుతోందని కుటుంబీకులు పేర్కొంటున్నారు.

సింగితం రిజర్వాయర్ బుంగకు మరమ్మతులు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్‌కు నర్వ శివారులోని అలుగు బుంగకు ఆదివారం మరమ్మతు పనులకు భూమిపూజ చేశారు. రిజర్వాయర్ వద్ద భారీ బుంగ పడి సాగు నీరు వృథా అవుతున్న విషయాన్ని ఆయకట్టు ప్రాంత రైతులు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఫ్లడ్ డ్యామేజ్ నిధులతో బుంగ మరమ్మత్తు పనులకు ఆదేశించారు. దాంతో అలుగు వద్ద బుంగ ప్రాంతాన్ని జేసీబీతో తవ్వి మరమ్మతు పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో మహమ్మద్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి నాయకులు రమేష్‌యాదవ్, ఆకాష్, భూమాగౌడ్, తోట. రాజు, కాలిక్, నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.



మరమ్మతులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

పేద రైతులపై దాడిని ఖండిస్తున్నాం

బాన్సువాడ : పేద రైతులపై దాడిచేసి భూములను కబ్జా చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన బాన్సువాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నస్రుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామంలో పేదల భూములను మోహన్ అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడని, తమ భూమి తమకు ఇప్పించాలని పేద రైతులు తహసీల్దార్‌కు పిర్యాదు చేశారని, దీంతో విచారణ చేసిన తహసీల్దార్ ఆ భూములను పేద రైతులకు ఇవ్వాలని చెప్పగా మోహన్ రాజకీయ నాయకుల అండతో పేద రైతులపై దాడి చేశారని అన్నారు. పేద రైతులైన గంగారం, శ్రీనివాస్, మధు, శంకర్‌లపై కత్తులతో, గొడ్డలితో దాడి చేసి చంపాలని ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. దాడి చేసిన వారితో పాటు వారి వెనుకాల ఉన్న నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కోర్‌కమిటి సభ్యులు రవీందర్, మధు, శంకర్, రాజు తదితరులు ఉన్నారు.



బాన్సువాడ ఆస్పత్రిలో బాధిత రైతులను పరామర్శిస్తున్న సీపీఎం కార్యదర్శి వెంకట్‌గౌడ్

జోరందుకున్న వ్యవసాయ పనులు



పిట్లం(జుక్కల్) : పిట్లం మండలంలో రెండు రోజులు వర్షం పడడంతో రైతులు ఆనందరం వ్యక్తం చేస్తూ వ్యవసాయ పనులను జోరుగా కొనసాగిస్తున్నారు. మండల కేంద్రమైన పిట్లం, కంభాపూర్, గోద్మగాం, కారేగాం, ధర్మారం తదితర గ్రామాల్లో రైతులు తమ చేలల్లో కూలీలతో సోయా, పత్తి, జొన్న, మొక్కజొన్న లాంటి తదితర పంటల విత్తానాలు నాటడం ప్రారంభించారు.

తెలంగాణ ప్రాంత సభకు తరలిన కార్యకర్తలు



కామారెడ్డి టౌన్ : హైదరాబాద్‌లో జరిగిన స్వదేశీ జాగరణ మంచ్ స్వావలంబి భారత్ అభియాన్ తెలంగాణ ప్రాంత సభకు జిల్లాకు చెందిన స్వదేశీ జాగరణ మంచ్ కార్యకర్తలు ఆదివారం జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బోర్ర రాజగౌడ్, వంగ రాహుల్‌కుమార్, జంగం నరేష్, నారాయణ, రాజుపాటిల్, కృష్ణ, అరుణ్ కుమార్, లక్ష్మణ్, అంజు తదితరులున్నారు.

ఛత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడికి సన్మానం



కామారెడ్డి టౌన్ : హైదరాబాద్‌లో జరిగిన ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఛత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడు దీపక్ బైజును ఆదివారం జిల్లా ఎస్టీ సెల్ కాంగ్రెస్ చైర్మన్ రాణాప్రతాప్ రాథోడ్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు భూక్యరాజు, సదర్‌నాయక్, మోహన్‌నాయక్ తదితరులున్నారు.

రోడ్లపైనే పశువులు.. ఇబ్బందుల్లో ప్రజలు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ఎల్లారెడ్డి-కామారెడ్డి ప్రధాన రోడ్డు సంతగా మారిపోయింది. దీంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలరోజులుగా ప్రతీరోజు పదుల సంఖ్యలో పశువులు రోడ్డుపైకి వచ్చి అడ్డంగా పడుకుంటున్నాయి. దీంతో వాహప చోదకులకు ఇబ్బందిగా మారింది. పశువుల యజమానులు వాటిని పట్టించుకోకుండా ఇష్టానుసారంగా రోడ్లపై వదిలేస్తున్నారిని గ్రామస్తులు మండిపడుతున్నారు. పశువులను మేపడం చేతకాకపోతే విక్రయించుకోవాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలు పోతే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశుపోషణ చేసే పద్ధతి ఇదేనా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల యజమానుల గుర్తించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



లింగంపేటలోని కామారెడ్డి- ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డుపై పశువులు

మురికినీటితో అవస్థలెన్నో..

బీబీపేట : గ్రామీణ ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షణాలోపంతో పారిశుద్యం అస్తవ్యస్తంగా మారింది. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇస్తున్న రూ. కోట్ల నిధుల వినియోగం అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు లేక అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రధానంగా మండల కేంద్రంలోని ఇంద్రనగర్ కాలనీలో డ్రెయినేజీ నీరు రోడ్డుపై చేరి కంపు కొడుతోంది. రోడ్డుపై నుంచి డ్రెయినేజీ నీరు పారడంతో కుంటను తలపిస్తోంది. మురికి నీరు అలాగే నిలిచి ఉండడంతో పందులు కూడా స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో మురికి నీరు కాస్త మల్కాపూర్ వెళ్లే రహదారిపై నుంచి ప్రవహిస్తుండడంతో వెళ్లే ప్రజలు, ప్రయాణికులు, అధికారులు సైతం నీటి అడుగు భాగంలో ఏమి ఉంటుందోనని భయాందోళనలకు గురవుతున్నారు.



బీబీపేట ఇంద్రనగర్ కాలనీలో నిలిచి ఉన్న మురికి నీరు

ఆధ్యాత్మికం

ఘనంగా జగదాంబ సరస్వతి పుణ్య స్మృతి దివస్



కామారెడ్డి అర్బన్ : సేవాభావం, సంస్కారం, ప్రేమ గౌరవం, మర్యాద, మానసిక ఒత్తిడి లేకుండా ఉండడానికి ప్రతిఒక్కరు రాజయోగ ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందనిమున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు.ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం మాతేశ్వరి జగదాంబ సరస్వతి 59వ పుణ్య స్మృతి దివాస్‌ను కామారెడ్డి ఓంశాంతి కేంద్రం ఆదివారం ఉదయం ఆధ్యాత్మిక జ్ఞాన దివాస్‌గా ఘనంగా నిర్వహించారు. జగదాంబ సరస్వతి చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఓంశాంతి నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇంచార్జి జయదిదీ, బ్రహ్మకుమారీలు గంగ,లలిత, అనిల్, సంతోషి, దీప, కౌన్సిలర్లు హఫీజ్, పాత శివకృష్ణమూర్తి, మాజీ కౌన్సిలర్ జే.సుధాకర్, డాక్టర్ అనూష పాల్గొన్నారు.

గ్రామదేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గ్రామస్తులు ఆదివారం గ్రామ దేవతలకు పూజలు చేశారు. గ్రామ శివారులో ఉన్న ఎల్లమ్మ, నల్లపోచమ్మ, పెద్దపోచమ్మ, పెద్దమ్మ, మైసమ్మ తదితర గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి ఈ ఖరీఫ్‌లో వేసిన పంటలు బాగా పండాలని ఆ గ్రామ దేవతలను వేడుకున్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామంలో ఉన్న కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అమ్మావారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

తాండూర్‌లో భక్తిశ్రద్ధలతో బోనాలు..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని తాండూర్ గ్రామంలో ఆదివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కట్ట మైసమ్మకు బోనాలతో మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు.

వైభవంగా నల్ల పోచమ్మ పండగ



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం గ్రామస్తులు అమ్మవారి బోనాల పండగను వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని అమ్మవారి ఆలయంలో పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. వర్షాలు బాగా కురిసి పాడి పంటలు బాగా పండాలని రైతుల ఇంట సిరిసంపదలు తులతుగాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు.

సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



లింగంపేటలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వెల్లుట్లలో..

రైతులకు ఒకే దఫాలో రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



కామారెడ్డి పట్టణంలో..



తాడ్వాయిలో..



రామారెడ్డిలో..



వెంకంపల్లిలో..



సదాశివనగర్‌లో..

సంక్షిప్తం

నేడు విద్యుత్ కార్యాలయంలో ప్రజావాణి

బిచ్కుంద(జుక్కల్) : విద్యుత్ సమస్యలు పరిష్కారం కోసం ప్రతి సోమవారం సబ్‌స్టేషన్ ఆవరణలో ఉన్న విద్యుత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. రైతులు, ప్రజలు ఏదైనా సమస్యలు ఉంటే ప్రజావాణిలో దరఖాస్తులు పెట్టుకోవాలి. వెంటనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రజావాణి ప్రారంభమవుతుందన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



బాన్సువాడ : పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఆలయంలో ప్రతిరోజు నిత్య అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిరోజు దాతలు అన్నదానానికి ముందుకు రావడం అభినందనీయమని ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు బెజుగం శంకర్ అన్నారు.

వర్షాలు పడాలని పూజలు



పిట్లం(జుక్కల్) : మండలంలోని కంభపూర్ గ్రామంలో రైతులు, గ్రామస్తులందరు కలిసి కట్ట మైసమ్మ పండగను ఘనంగా జరుపుకున్నారు. వర్షాకాలం వర్షాలు సకాలంలో పడి పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నవోదయ, సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు శిక్షణ

బాన్సువాడ : పట్టణంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నవోదయ, సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు విద్యార్థి స్టడీ సర్కిల్ డైరెక్టర్ నరేష్ తెలిపారు. బాన్సువాడలోని విద్యార్థి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పరిధిలో 5వ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా నవోదయ, సైనిక్ స్కూల్‌కు శిక్షణ ఇవ్వనున్నట్లు, ఈనెల 30 నిర్వహించే టాలెంట్ టెస్ట్‌కు హాజరుకావాలని సూచించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. పూర్తి వివరాలకు 94400 95566కు సంప్రదించాలని అన్నారు.

తాడ్వాయిలో కురిసిన వర్షం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలలో శనివారం రాత్రి వర్షం కురియడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభ దశలో వర్షం కురియడంతో పంటలను సాగు చేసుకోవచ్చని రైతులు తెలిపారు. గత యేడాది వర్షాలు సరిగ్గా కురియక పోవడంతో పంటలు సరిగ్గా పండక పోవడక రైతులు దిగాలుతో ఉన్నారు. ఈ తరుణంలో మండలంలోని చాలాగ్రామాల్లో వర్షం కురియడంతో దుక్కిలో వేసిన విత్తనాలు తప్పనిసరిగా మొలుస్తాయని ఆశతో ఉన్నారు.